పేదలకు అండగా కస్తూర్బాలు

- ఆరు నుంచి ఇంటర్ వరకు అన్ని సౌకర్యాలు
- ఎస్ఎస్సీ, ఇంటర్‌లలో మెరుగైన ఫలితాలు
- ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు



బిచ్కుంద కేజీబీవీ విద్యాలయ భవనం

బిచ్కుంద(జుక్కల్) : కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలు అనాథ, నిరుపేద బాలికలకు అండగా నిలుస్తున్నాయి. ఆరో తరగతి, ఇంటర్ వరకు వసతులతో కూడిన నాణ్యమైన చదువులు, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన, ఉచిత యూనిఫాం, భోజన వసతి అందిస్తున్నారు. వైద్య సేవలు, అన్ని విధాల రక్షణకు ఎలాంటి ఢోకా లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కేజీబీవీలో తమ పిల్లలను చేర్పించడానికి ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో అడ్మిషన్లకు డిమాండ్ పెరిగింది. బిచ్కుంద కేజీబీవీలో ఆరో తరగతిలో అడ్మిషన్ల కోసం 40 సీట్లకుగాను 65 దరఖాస్తులు వచ్చాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 40 సీట్లకు 58 దరఖాస్తులు వచ్చాయి. పాఠశాలలో 380 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు కేజీబీవీలు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

పరీక్షల్లో మెరుగైన ఫలితాలు...

2024–25 విద్యా సంవత్సరానికి కేజీబీవీ విద్యార్థులు పదో తరగతి, ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించారు. ఎస్ఎస్సీలో 88.94 శాతం, ఇంటర్ ఫస్టియర్‌లో 75 శాతం, సెకండియర్‌లో 92.16 శాతం ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీలలో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ (మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, అనాథ తదితర అన్ని కేటగిరీ వర్గాలకు సీట్లు కేటాయించనున్నారు.

అనాథలకు మొదటి ప్రాధాన్యత

కేజీబీవీ గురుకుల విద్యాలయంలో చేరడానికి అనాథ పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం. నాణ్యమైన చదువులు, పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదాలు వేస్తున్నాము. పారదర్శకంగా అన్ని కేటగిరి వర్గాల విద్యార్థులకు సీట్లు కేటాయిస్తున్నాం. కేజీబీవీలో బాలికలకు అన్ని విధాలుగా రక్షణ ఉంటుంది.

– రాగిణి, ప్రిన్సిపాల్, కేజీబీవీ బిచ్కుంద

నేటి చిత్రం

కోతుల బెడద నివారించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని బీసీ కాలనీలో కోతులు ఇళ్లలోకి వెళ్లేదారిలో అడ్డుగా ఉండి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రోడ్లపై తిరిగేవారిపై దాడులు చేయడమే కాకుండా కోతులు నేరుగా ఇళ్లల్లోకి దూరి తినేవాటిని ఎత్తుకెళ్తున్నాయి. ఇళ్లలోని వంటగదుల్లోకి ప్రవేశించి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. అధికారులు స్పందించాలి.

– అంజయ్య, బీసీ కాలనీ, ఎల్లారెడ్డి

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200
ఎల్లారెడ్డి : 97053 46576
బాన్సువాడ : 94402 11363
జుక్కల్ : 97053 46578

‘భూ భారతి’ నిరంతర ప్రక్రియ

- భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు
- అదనపు కలెక్టర్ విక్టర్



హండేకేలూర్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

మద్నూర్/పెద్దకొడప్‌గల్(జుక్కల్): భూ భారతి చట్టం నిరంతర ప్రక్రియ అని, ప్రజలు ఆందోళన చెందొద్దని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. పెద్దకొడప్ రైతువేదికలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మద్నూర్ మండలం హండేకేలూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సును అదనపు కలెక్టర్ పరిశీలించారు. హండేకేలూర్‌లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తుదారుల నుంచి తహసీల్దార్ ముజీబ్ స్వీకరించారు. భూమికి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని అదనపు కలెక్టర్ చెప్పారు. అటవీ భూములను జాగ్రత్తగా పరిశీలించాలని ఎలాంటి తప్పులు దొర్లకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, ఎస్సై మహేందర్, నాయబ్ తహసీల్దార్లు రవికాంత్, శివరామకృష్ణ, ఆర్ఐ శంకర్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

తాడ్వాయి/ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి)/భిక్కనూరు : తాడ్వాయి మండలంలోని నందివాడ, చిట్యాల గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ శ్వేత పాల్గొన్నారు. ఎల్లారెడ్డి మండలం మీసాన్‌పల్లి,మత్తమాల గ్రామాలలో తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ సిబ్బందితో కలిసి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భిక్కనూరు మండలం తిప్పాపూర్ గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులోతహసీల్దార్ సునీత పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు.

పండరీపూర్ మార్కెట్ కమిటీ సందర్శన



బాన్సువాడ : మహారాష్ట్రలోని పండరీపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీని బుధవారం బాన్సువాడ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు సందర్శించారు. వ్యవసాయ రంగంలో నూతన వ్యవసాయ పద్ధతులపై అధ్యాయనం చేశారు. అక్కడి అధికారులతో చర్చించారు. పంటల మార్పిడి, పప్పుదినుసుల దిగుబడి తదితర అంశాలపై ఆరా తీశారు. అక్కడికి వెళ్లిన వారిలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మంత్రి అంజవ్వ, గణేశ్‌తో పాటు పాలకవర్గ సభ్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా



మాట్లాడుతున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి

కామారెడ్డి టౌన్ : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలతో కలిసి కృషి చేస్తానని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అభివృద్ధి కోసం ఆహర్నిషలు కృషి చేస్తానని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా ప్రణాళిక చేపడుతామన్నారు. కామారెడ్డి పట్టణ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు తీసుకోచ్చేలా బాధ్యత తీసుకుంటానని అన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో విభేదాలకు తావివ్వకుండా ముందుకువెళ్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు శివకృష్ణమూర్తి, రవి, అన్వర్, జూలూరి సుధాకర్, రాంమోహన్, చాట్ల వంశీకృష్ణ, సలీం, సాయిబాబా, సుగుణ తదితరులున్నారు.

చంద్రశేఖర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డిని కామారెడ్డిలో బుధవారం కాంగ్రెస్ పార్టీ తాడ్వాయి మండల అధికార ప్రతినిధి షౌకత్‌అలీ, నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అధికార ప్రతినిధి షౌకత్‌అలీ, సీడీసీచైర్మన్ ఇర్షాద్‌అలీ,నాయకులు పైడి సంతోష్ రెడ్డి, పైడిసురేష్ రెడ్డి తదితరులున్నారు.

పార్టీ కోసం కష్టపడ్డ వారికి పదవులు



మాట్లాడుతున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి

కామారెడ్డి టౌన్ : పార్టీ కోసం కష్టపడ్డవారికి తప్పకుండా పదవులు దక్కుతాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అంటే క్రమశిక్షణకు మారుపేరు అని అన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చొరవ వల్లే తనకు ఈ పదవి దక్కిందని ఈ మేరకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తనుకు బాధ్యతలు అప్పగించిన కేంద్ర, రాష్ట్ర నాయకత్వానికి రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, నాయకులు రమేష్, నౌసిలాల్ నాయక్, అనంతరెడ్డి, యాదవ రెడ్డి, తిర్మల్‌గౌడ్, ఐరేనీ సందీప్, గోనె శీను, చాట్ల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి



జిల్లా కేంద్రంలోని కమ్మర్‌గల్లి అంగన్‌వాడీలో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న టీచర్, ఆయా



పంచముఖి హన్‌మాన్ కాలనీలో..



జిల్లా కేంద్రంలోని శ్రీరామ్ నగర్‌లో..



అక్కంపల్లి అంగన్‌వాడీకేంద్రంలో..




బాన్సువాడలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



కంభాపూర్ గ్రామంలో..

- బాన్సువాడ సీడీపీవో సౌభాగ్య
- సెంటర్లలో ఎగ్ బిర్యానీ ప్రారంభం



చిన్న టాక్లీలో తయారు చేసిన ఎగ్ బిర్యానీ



తింటున్న చిన్నారులు

బాన్సువాడ/పిట్లం/నిజాంసాగర్/కామారెడ్డి టౌన్/ బీబీపేట/కామారెడ్డి అర్బన్/రామారెడ్డి/మద్నూర్/ నాగిరెడ్డిపేట : అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని బాన్సువాడ సీడీపీవో సౌభాగ్య అన్నారు. బుధవారం పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. మహమ్మద్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్ వైజర్ రాజేశ్వరి పాల్గొని మాట్లాడారు. బీబీపేట మండలం ఉప్పర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల తల్లిదండ్రులకు సూపర్‌వైజర్ శోభారాణి అవగాహన కల్పించారు.రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో డీడబ్ల్యూవో ప్రమీల, సీడీపీవో శ్రీలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలను మామిడితోరణాలు, బెలూన్లతో ఆకర్షణీయంగా తయారుచేశారు. కేంద్రంలో పలువురు చిన్నారుల పేర్లను నమోదు చేసుకున్నారు. అంగన్‌వాడీ సెంటర్లలలో ఎగ్ బిర్యానీ పథకాన్ని ప్రారంభించి పిల్లలకు వడ్డించారు.అంగన్‌వాడీ సెంటర్‌లలో చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. ఈకార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు, సిబ్బంది, తదితరులున్నారు.



మహమ్మద్ నగర్‌లో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రాజేశ్వరి



ఉప్పర్‌పల్లిలో ..



రామారెడ్డిలో..

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఎంఈవో రాజులు

ఎల్లారెడ్డిరూరల్/పిట్లం/బిచ్కుంద/తాడ్వాయి/రాజంపేట/సదాశివనగర్/లింగంపేట/భిక్కనూరు : ప్రభుత్వ పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎల్లారెడ్డి ఎంఈవో రాజులు అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్కావెంజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిచ్కుంద మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్లు, హెచ్ఎంలకు బిచ్కుందలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. తాడ్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కావెంజర్లతో నిర్వహించిన సమావేశంలో ఎంఈవోరామస్వామి మాట్లాడారు.పిట్లం బాలుర ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, వంట చేసే సిబ్బందికి, స్కావెంజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో దేవిసింగ్ మాట్లాడారు. రాజంపేట మండలంలోని కేజీబీవీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు, శానిటరీ వర్కర్స్‌కు శానిటరీ హైజిన్ పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల విద్యాధికారి పూర్ణచందర్ రావు తెలిపారు.సదాశివనగర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఎంఈవో యోసెఫ్ పాల్గొని మాట్లాడారు. లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్కావెంజర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఎంఈవో షౌకత్ అలీ మాట్లాడారు. అలాగే ఎమ్మార్సీ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో షౌకత్‌అలీ దుస్తులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో హెచ్ఎంలు ఉపాధ్యాయలు తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరులో ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఎంఈవో రాజగంగారెడ్డి పాల్గొని మాట్లాడారు.

ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం డీఈవో ఎస్.రాజుకు వినతిపత్రం అందజేశారు. స్కూల్‌లు ప్రారంభవుతున్న సందర్భంగా స్కూల్‌లలో మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీరు, ప్రహరీ తదితర మౌళిక సదుపాయలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాహుల్, జిల్లా సహాయ కార్యదర్శి నితిన్, నాయకులు మణికంఠ, శ్రీకాంత్, నవీన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యం అమ్మకాన్ని నిషేధిస్తూ ఏకగ్రీవ తీర్మానం



రాజంపేట : రాజంపేట మండలం కొండాపూర్, గుడితండా గ్రామ పంచాయతీ పరిధిలో బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలను నిషేధిస్తూ బుధవారం ఇరు గ్రామాల ప్రజలు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇరు గ్రామలలో మద్యం దుకాణాలు ఉండటంతో ఇటు రైతులతో పాటు యువత పక్కదారి పడుతుండటంతో ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే వారికి రూ. లక్ష జరిమానాతో పాటు ఏడు చెప్పుదెబ్బలని తీర్మానంలో పేర్కొన్నారు. గ్రామాలలో మద్యం అమ్మిన వారి పేరు తెలిపిన వ్యక్తికి రూ. 10 వేల పారితోషకం అందిస్తామని, అదే విధంగా సంబంధిత వ్యక్తి పేరు గోప్యంగా ఉంచబడుతుందని తెలిపారు. అనంతరం రెండు గ్రామాల ప్రజల గ్రామాలలోని ప్రధాన వీధుల గుండా బైకు ర్యాలీ నిర్వహించారు.

ఎమ్మెల్యేకు విద్యుత్ ఉద్యోగుల వినతి



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని ఎమెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి విద్యుత్ ఉద్యోగులు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. విద్యుత్ శాఖ లో 1999 నుంచి 2004 వరకు నియామకమైన ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయాలని ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ జేఏసీ ప్రతినిధులు బి. కమలాకర్,వై. సంపత్, గులాం గౌస్, ప్రదీప్ కుమార్, నందకుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోదండరాంకు..



కామారెడ్డి టౌన్ : టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు తెలంగాణ జనసమితి జిల్లా నాయకులు బుధవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలోని ప్రాణహిత చేవేళ్ల 22 ప్యాకేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి ప్రభుత్వంతో చర్చించి కావాల్సిన పూర్తి నిధులు మంజూరు కోసం కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. కామారెడ్డి, మెదక్, నిజామాబాద్ జిల్లాలకు సాగు, తాగునీటి కోసం ప్రాజెక్ట్ పనులు త్వరగా పూర్తి అయ్యేలా సీఎంతో చర్చించాలని కోరారు. అలాగే నామినేటెడ్ పోస్టులలో జిల్లా నాయకులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్, జిల్లా అధ్యక్షుడు కుంభాల లక్ష్మణ్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జడల రజనీకాంత్, ఉపాధ్యక్షుడు పూల్ సింగ్ రాథోడ్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, నాయకులు ఆకుల సంజు, మధు, గిరి, చందు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం



కామారెడ్డి క్రైం: జిల్లా అధికారులుగా పనిచేసి పదోన్నతిపై వెళ్తున్న సీపీవో రాజారాం, షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారిణి రజితలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా అధికారులు బుధవారం ఘనంగా సన్మానించారు. వారు అందించిన సేవలు మరువలేనివని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కాంగ్రెస్ నాయకులు



ఎల్లారెడ్డిరూరల్ : ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తిరుపతి మానవత్వం చాటుకున్నారు. పట్టణంలోని 9వ వార్డులో శిథిలావస్థకు చేరిన ఇంటిలో నివసిస్తున్న కళ్లు లేని వృద్ధుడు గోపని రాములును ఆ ఇంటి నుంచి బయటకు తీసుకుని వచ్చి అద్దె ఇంటిలో దించారు. అద్దె ఇంటి ఖర్చులను సైతం ఆయన భరించనుండడంతో స్థానికులు ఆయనను అభినందించారు.

సంక్షిప్తం

17న ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎక్సైజ్ కార్యాలయంలో ఈనెల 17న వాహనాల వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు వివిధ కేసులలో పట్టుబడిన వ్యాగన్ ఆర్ కారు, గ్లామర్ బైకును ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ఎల్లారెడ్డి ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సీఎం చిత్రపటానికి అర్చకుల అభిషేకం

మద్నూర్(జుక్కల్): అర్చక ఉద్యోగులతో అమలు చేస్తున్న విధంగా ధూపదీప నైవేద్య అర్చక గ్రాంటు మంజూరు చేయడంతో మండల అర్చకులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి అర్చకులు పాలాభిషేకం చేశారు. ఆలయంలో సీఎం పేరుపై అర్చన చేశారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు స్వామి అంజనప్ప, అర్చకులు కులకర్ణి వేణు, విజయ్ మహారాజ్, శైలేంద్ర మహారాజ్, అరవింద్ మహారాజ్ తదితరులున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి



భిక్కనూరు: ప్రతి కాన్పు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగేలా వైద్య సిబ్బంది ఆశవర్కర్లు కృషిచేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభుకిరణ్ అన్నారు. బుధవారం ఆయన భిక్కనూరు ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి వారికి సేవలు చేసి గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యురాలు యెమిమా ఎంపీహెచ్ఈవో వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ సతీష్, స్టాఫ్‌నర్స్ హరిత, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో విప్లవాత్మక మార్పులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): నానో యూరియాతో సాగులో విప్లవాత్మక మార్పులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ప్రజాపతి సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. సంప్రదాయ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడకంతో రైతులకు ఖర్చు భారం తగ్గనుందన్నారు. 500మి.లీ నానో యూరియా బాటిల్ 45 కిలోల యూరియా బస్తాకు సమానమన్నారు.

నేడు టోల్‌ప్లాజా వద్ద వాహనదారుల ధర్నా

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలో టోల్‌ప్లాజా వద్ద గురువారం ఉదయం 10 గంటలకు మండలంలోని అన్ని వాహనదారుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు వాహనదారులు తెలిపారు. మండలంలోని లోకల్ వాహనాలకు టోల్ పన్నును వసూలు చేస్తున్నారని గతంలో ఎప్పుడు కూడా లోకల్ వాహనాలకు పన్ను తీసుకోలేదని ఇప్పుడు నూతన కాంట్రాక్టర్ టోల్ పన్ను వసూలు చేస్తున్నారని అన్నారు. ఇందుకు నిరసనగా టోల్ ప్లాజా వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు.